భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబురాలు



నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తెలంగాణ బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవ సహాయంలతో కలిసి గౌరీ మాతకు పూజలు నిర్వహించి బతుకమ్మ సంబురాలను ప్రారంభించారు. వివిధ శాఖలకు చెందిన మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను తయారు చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే పూర్తి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియ పూర్తయిందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, పుర కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే సందర్భంగా గుర్తించిన సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను ప్రమాణికంగా తీసుకుని అన్ని గ్రామాలలో చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎంపిక చేసిన గ్రామాలలో డిజిటల్ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వేడుకలు : ఎస్పీ



ఆయుధపూజ చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

కందనూలు, న్యూస్‌టుడే : అమ్మవారి అనుగ్రహంతో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆకాంక్షించారు. దసర పండుగ సందర్భంగా గురువారం పట్టణంలోని పాత జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆయుధ పూజ, వాహనపూజలు నిర్వహించారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించడానికి పోలీసు సిబ్బంది నిరంతరం పని చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన నేరుగా ఠాణాల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామేశ్వర్, ఏఆర్ అదనపు ఎస్పీ భరత్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్సై గోవర్ధన్ పాల్గొన్నారు.



ఆకాశం.. ఈ నీటిలో..

ప్రకృతి కనువిందు చేస్తోంది. పచ్చదనానికి తోడు నీలాకాశంలో పాల నురగలాంటి తెల్లటి మబ్బులు అటూ ఇటూ కదులుతూ మనసు దోచేస్తున్నాయి. మహబూబ్‌నగర్ పురపాలక పరిధి బోయపల్లి శివారు హనుమాన్ చెరువు నీటిలో అందంగా ప్రతిబింబిస్తున్న మేఘాలను 'ఈనాడు' తన కెమెరాలో బంధించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్



జోగులాంబ అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవం.. అమ్మవారి రథోత్సవం

అలంపూర్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం దుర్గాష్టమిని పురస్కరించుకుని జోగులాంబ ఆలయంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథాన్ని పుష్పాలతో అలంకరించి అమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఉంచారు. ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి గుమ్మడి కాయ సమర్పించి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు సాగింది. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



మహాగౌరీదేవి అలంకారంలో జోగులాంబ

మహాగౌరీదేవిగా..: ఎనిమిదో రోజు జోగులాంబ మహాగౌరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దర్బారు సేవలో కొలువు నిర్వహించి కుమారి సవాసిని పూజలు, మహామంగళ హారతి, మంత్రపుష్పాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలను తిలకించారు.

సార్లు.. కుర్చీలు వదలట్లే!

అక్రమ ఇసుక రవాణాలో పోలీసుల తీరిది

వీఆర్‌కు వెళ్లకుండా పెద్దఎత్తున పైరవీలు



మహబూబ్‌నగర్, ఈనాడు : ఉమ్మడి జిల్లాలో అక్రమార్కులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులకు ఇసుకే కాసుల కురిపించే కల్పవృక్షంగా మారింది. ఏ పార్టీ అధికారంలోకి ఆ పార్టీ నాయకులు దీన్నే సంపాదనా మార్గంగా ఎంచుకుంటున్నారు. సహజంగానే వీరికి అధికారులు వంతపాడుతూ స్వామికార్యం, స్వకార్యం కానిచ్చేస్తున్నారు. అలాంటి వారిపై ఎట్టెట్టో తొలిసారిగా ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. ఇసుక అక్రమ రవాణా కట్టడిలో విఫలమయ్యారంటూ ఇటీవల ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్‌ఐలను వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో పెట్టారు. ప్రభుత్వం బాగా స్పందిస్తోందని అందరూ అనుకున్నారు. తీరా చూస్తే వేటుపడిన సార్లెవరూ కాసులు గలగలలాడే సీట్లను వదలట్లేదు.

పెద్ద తలకాయల అండదండలు : ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించినందుకు ఉమ్మడి జిల్లాలోని వంగూరు, ఉప్పునుంతల, బిజినేపల్లి, తెలకపల్లి, వీపనగండ్ల ఎస్‌ఐలపై వేటు వేశారు. ఇందులో వీపనగండ్ల ఎస్‌ఐని ఇటీవలే బదిలీ చేశారు. మిగతా నాలుగు స్టేషన్ల ఎస్‌ఐలు మాత్రం కదలట్లేదు. రాష్ట్ర మల్టీజోన్-2 ఐజీపీ సత్యనారాయణ గత గురువారం వేటు వేసినా ఆ ఠాణాల్లోనే విధులు నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. తమ అక్రమ రవాణా దందాకు బాగా సహకరించే అధికారులు ఆయా ఠాణాల నుంచి వెళ్లకుండా నాయకులు పెద్దఎత్తున పైరవీలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి సోదరుడే నేరుగా రంగంలోకి దిగి వేటు పడిన ఎస్‌ఐలను వీఆర్‌కు పంపించకుండా చక్రం తిప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

సీఎం సొంత జిల్లాలోనే ఇలా.. : నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుందుభి పరిధిలో అక్రమ ఇసుక రవాణా కొన్నేళ్లుగా పెద్దఎత్తున నడుస్తోంది. సీఎం సొంత జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛ సాగటంతో విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. దీన్ని తీవ్రంగా పరిగణిస్తూ ఉన్నతాధికారులు పలువురు పోలీసులపై వేటు వేయడంపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హర్షం వ్యక్తమైంది. తర్వాత ఏమైందో వీఆర్‌లో పెట్టిన ఎస్‌ఐలు ఇక్కడే విధుల్లో కొనసాగటం అందరినీ విస్తుగొల్పుతోంది. ఎస్‌లు వీఆర్‌కు వెళ్లేందుకు జిల్లా అధికారుల నుంచి కౌంటర్ డిపార్ట్‌మెంటల్ ఉత్తర్వులు వెలువడకుండా నేతలు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. పోలీసులపై వేటు వేసినా అమలు కాకపోతుండటంతో ఇసుకాసరులు మరింత రెచ్చిపోతున్నారు. నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను 'ఈనాడు' సంప్రదించగా చర్యలు చేపడతామన్నారు.



వంగూరు : ఉల్పర సమీపంలో నిల్వ చేసిన ఇసుకను టిప్పర్లలో నింపుతున్న పొక్లెయిన్ (పాతచిత్రం)

లక్ష్యం నిర్దేశించుకుని వసూళ్లు.. :
నెలనెలా భారీ స్థాయిలో మామూళ్లు వచ్చే ఇసుక లభించే ప్రాంతాల్లో సీఐలు, ఎస్సైలు, తహసీల్దార్ పోస్టులకు తీవ్రమైన డిమాండ్ ఉంటోంది. రూ.లక్షలు చెల్లించి ఇక్కడ పోస్టింగు వేయించుకుంటున్న అధికారులు లక్ష్యం నిర్దేశించుకుని మరీ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పారే దుందుభి వాగు ఉన్న పలు ఠాణాల్లో ప్రతి ట్రాక్టర్‌పై నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అందుకే వాగులు, నదుల పరీవాహక ప్రాంతాల నుంచి వెళ్లడానికి అధికారులకు ఏమాత్రం ఇష్టముండదని అంతా చెబుతుంటారు.

తెల్లబంగారం నేలచూపు



గద్వాల, శాంతినగర్ న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో సాగులో పత్తిదే అగ్రస్థానం. అయితే మొన్నటి వరకు మద్దతు ధర కంటే అధికంగా రూ.8 వేలున్న పత్తి ధరలు ఒక్కసారిగా దిగి వస్తుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 9.50 లక్షల ఎకరాల వరకు రైతులు సాధారణ పత్తి సాగు చేశారు. విత్తనపత్తి సాగు మరో 50 వేల ఎకరాల వరకు ఉంటుంది. సాధారణ పత్తి పంట రైతులకు ఇప్పుడిప్పుడే చేతికి వస్తోంది. ఈసారి భారీ వర్షాల కారణంగా పత్తి పంట పూతపిందె సమయంలో కొంత దెబ్బతినింది. దిగుబడి కూడా ఆశించిన విధంగా వచ్చే అవకాశం లేదని రైతులంటున్నారు. మరి ముఖ్యంగా నాగర్‌కర్నూల్, జోగులాంబ జిల్లాల్లోనే అత్యధికంగా సాధారణ పత్తి సాగైంది.

పడిపోతోంది: మొన్నటి వరకు రూ.8,100 వరకు పలికిన సాధారణ పత్తి ధర క్రమంగా తగ్గిపోతోంది. గత వారం రోజులుగా ధరలు పడిపోవటంతో రైతులు తీసిన పత్తిని కూడా మార్కెటుకు తరలించకుండా నిల్వ ఉంచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ధరలు రూ.6 వేల నుంచి రూ.6,500 వరకు పలుకుతున్నాయి. ఇవి ఇంకా పతనమయ్యే అవకాశం ఉందని రైతులంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 45.50 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా. క్వింటా మీద రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు ధర తగ్గితే రైతులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున నష్టం వాటిల్లనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేవలం పత్తి క్రయవిక్రయాల విలువ రూ.3,500 కోట్ల వరకు ఉంటుంది. క్వింటా మీద రూ.వెయ్యి తగ్గినా రైతులు రూ.450 కోట్ల మేర నష్టపోతారు. అదే రూ.2 వేలు పడిపోతే ఈ నష్టం రెట్టింపవుతుంది.



శాంతినగర్: దళారులు కొనుగోలు చేసిన పత్తి తరలుతుందిలా..

దళారులకు వరం

పత్తి కొనుగోలుకు సీసీఐ కేంద్రాల ఏర్పాటు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఆయా జిల్లా కేంద్రాల పరిధిలో రెండు, మూడు కూడా ఏర్పాటు చేయని పరిస్థితి ఉంది. జోగులాంబ జిల్లాలో అలంపురులో ఒక సీసీఐ కేంద్రాన్ని జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేశారు. జిల్లా మొత్తంలో 1.90 లక్షల ఎకరాల సాగు ఉంది. 8.50 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి అంచనా ఉంది. కానీ సీసీఐ కేంద్రం మాత్రం ఒకటే ఏర్పాటైంది. ఇది దళారులకు వరంగా మారింది. ఇప్పటికే ప్రతి గ్రామంలో దళారులు పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. మార్కెట్ కంటే ఎక్కువిస్తామని రైతులను నమ్మించటం తీరా తూకాల్లో పెద్దఎత్తున మోసాలకు పాల్పడటం చేస్తున్నారు. వీటిపై దృష్టి సారించాల్సిన మార్కెటింగ్ శాఖ మాకెందుకులే అన్నవిధంగా వ్యవహరిస్తోందనే అభిప్రాయం ఉంది.

967 మందికి నియామక పత్రాలు

పెండింగ్‌లో మరో 164

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో ఫలితాల్లో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,131 ఖాళీలకుగాను 967 మందికి నియామక పత్రాలు ఇచ్చారు. ధ్రువపత్రాల తిరస్కరణ, రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు, స్పెషల్ ఎడ్యుకేటర్ల కోర్టు కేసులు తదితర కారణాలతో 164 పోస్టులను పెండింగ్‌లో ఉంచారు.



హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ డీఈవో గోవిందరాజులు చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న హరీశ్

ఉమ్మడి జిల్లాలో...

జిల్లా	ఖాళీలు	భర్తీ	మిగులు
మహబూబ్‌నగర్	243	214	29
నాగర్‌కర్నూలు	285	226	59
జోగులాంబ గద్వాల	172	149	23
వనపర్తి	152	126	26
నారాయణపేట	279	252	27

కోర్టు కేసులతో నిలిచిపోయినవి 113...

స్పెషల్ ఎడ్యుకేటర్ల ఎస్జీటీ పోస్టులు ఉమ్మడి జిల్లాలో 113 ఉన్నాయి. వారికి టెట్ అవసరం లేదని కొందరు అభ్యర్థులు కోర్టులో కేసు వేయడంతో వాటి భర్తీని నిలిపేశారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లాలో 20, నాగర్‌కర్నూలులో 41, జోగులాంబ గద్వాలలో 17, నారాయణపేటలో 16, వనపర్తి జిల్లాలో 19 ఖాళీగా ఉన్నాయి. అయితే స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులు 34కుగాను 20 భర్తీ చేయగా 14 ఖాళీలు మిగిలున్నాయి. దీంతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేటర్‌ల పోస్టుల ఖాళీలు సంఖ్య 127గా ఉంది. మరోవైపు ఉపాధ్యాయ పోస్టులు 37 భర్తీ కాలేదు. ఈ 37లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 11, భాషా పండితులు 7, ఎస్జీటీ 18, పీఈటీ ఒకటి చొప్పున ఉన్నాయి.

వెబ్ ఆప్షన్ల విధానంలో...

జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీల వివరాలను త్వరలో ప్రకటిస్తారు. దీన్ని ఆధారంగా ఎంపికైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. మెరిట్, రోస్టర్ పాయింట్ల ఆధారంగా వెబ్ ఆప్షన్లను పరిగణనలోకి తీసుకొని పాఠశాలలను కేటాయిస్తారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని అంచనా.

ఆదేశాల ప్రకారం చర్యలు

మిగిలిపోయిన ఖాళీల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం. త్వరలో అధికారుల ఆదేశాలతో అభ్యర్థులకు పాఠశాలలను కేటాయిస్తాం.

- గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూల్

సిరులు కురిపించిన విరులు


పండగ వేళ ఉమ్మడి జిల్లాలో రూ.10 కోట్ల వరకు వ్యాపారం



మహబూబ్‌నగర్ : గడియారం చౌరస్తాలో బతుకమ్మలను కొనుగోలు చేస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ సాంస్కృతికం : ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పూలనే దేవతగా కొలిచే గొప్ప పండగ బతుకమ్మ. ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ విశిష్ట సంస్కృతికి ప్రతీక. మహిళలకు సహజంగానే పూలంటే ఇష్టం. అలాంటిది పూలతో తయారు చేసే బతుకమ్మ పండగ, అందులోనూ అమ్మవారి వేడుక కావటంతో అతివల ఆనందానికి అవధులుండవు. పల్లెలు, పట్టణాల్లోని మహిళలు, యువతులు నిత్యం వర్ణరంజితమైన రకరకాల పూలతో బతుకమ్మలు తయారు చేస్తూ ఆనందంగా ఆడిపాడారు. కొందరు మహిళలు మార్కెట్‌లో కొనుగోలు చేసిన పూలతో బతుకమ్మలను తయారు చేశారు. మరికొందరు పూల వ్యాపారులు తయారు చేసే బతుకమ్మలనే కొనుగోలు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పూల వ్యాపారం బాగా సాగింది. తంగేడు, గునుగు, బంతులు, చేమంతి, గులాబీలు తదితరాలకు మార్కెట్‌లో భారీ ధర పలికింది. రైతులు, వ్యాపారులు లాభపడ్డారు.

భారీఎత్తున దిగుమతి : బతుకమ్మలకే కాకుండా దుర్గామాత ప్రతిమలు, మండపాల అలంకరణ, పూజల్లో పూలను ఎక్కువగా వాడటంతో ధరలు భారీగా పెరిగాయి. బంతి పూలు, గులాబీలు స్థానిక రైతులు పండించినవే. ఇతర పూలను మాత్రం ఉమ్మడి జిల్లాలోని వ్యాపారులు హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, రాయచూర్, చెన్నై, కర్నూల్ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గులాబీ పూలకు కిలో రూ.450, రూ.500 వరకు ధరలు పలికాయి. మార్కెట్లో పిడికెడు తంగేడు మొగ్గలు, ఆకులకు రూ.10 తీసుకున్నారు. ఒక మోస్తరు బతుకమ్మ తయారీకి అవసరమైన తంగేడు కోసమే రూ.200 ఖర్చయ్యింది. రూ.50లకు మూడు కట్టల పట్టుకుచ్చులు ఇచ్చారు. చిన్న గునగుపూల మోపునకు రూ.100 తీసుకున్నారు. చామంతి వంద గ్రాములకే రూ.30, పోకబంతులకు రూ.50, కిలో బంతిపూలు రూ.80, రూ.100 ధర పలికాయి. ఇతర పూలు, గౌరమ్మ ప్రతిమ, కలువలకు రూ.150 కావాల్సిందే. వ్యాపారులు తయారు చేసిన చిన్న బతుకమ్మనే రూ.500లకు అమ్ముతున్నారు. సొంతంగా బతుకమ్మ తయారు చేసుకోవాలంటే రూ.800ల వరకు ఖర్చయ్యింది. ఈ పండగకు ఉమ్మడి జిల్లాలో రూ.10 కోట్ల వరకు పూల వ్యాపారం జరిగిందని అంచనా.



మాకు ఇప్పుడే పెద్ద గిరాకీ : పూల వ్యాపారులకు ఈ సమయంలో మంచి గిరాకీ ఉంటుంది. దుర్గామాత అలంకరణ, బతుకమ్మల తయారీకి రకరకాల పూలు కొనుగోలు చేస్తారు. మహబూబ్‌నగర్‌లో పెద్ద పూల దుకాణాలు 21 ఉన్నాయి. పట్టణంలోని చిన్న, పెద్ద దుకాణాల్లో కలిపి ఈ సీజన్‌లో రోజుకు రూ.2 లక్షలకు పైగా వ్యాపారం సాగింది. మహబూబ్‌నగర్ పట్టణం, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, వనపర్తి, గద్వాల, అలంపూర్, నారాయణపేట, దేవరకద్ర, కొత్తకోట, మరికల్, కోస్గి, కొడంగల్, మహ్మదాబాద్ తదితర ప్రాంతాల్లో ఈ 10 రోజుల్లో రూ.10 కోట్లకు పైగా పూల కొనుగోళ్లు జరుగుతాయని అంచనా.

- అప్సర్, పూల వ్యాపారి, మహబూబ్‌నగర్



ధరలు పెరిగినా కొనుగోలు చేశాం : మహిళలకు దుర్గా నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలు ఎంతో ప్రత్యేకం. పూలధరలు పెరిగినా బతుకమ్మపై భక్తితో తప్పకుండా కొనుగోలు చేస్తాం. బతుకమ్మ తయారీ కోసం పూలకే రూ.700 వరకు ఖర్చు చేశాం.

- వెంకటేశ్వరమ్మ, వేంకటేశ్వరకాలనీ, మహబూబ్‌నగర్

వీరుల గాథలు తెలుసుకునేలా..

విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోటీలు



వీర్ గాథా వెబ్‌పేజీ

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్

విద్యార్థి స్థాయి నుంచే దేశభక్తిని పెంపొందించడానికి దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల గాథలు తెలియజేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. రక్షణ, విద్యా మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి 'వీర్ గాథ-4.0' పేరుతో వీటిని నిర్వహిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు, వీసీలు నిర్వహించి సూచనలు చేశారు.

3 నుంచి ఇంటర్ తరగతులకు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 210కి పైగా జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో 3వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చు. అక్టోబరు 15వ తేదీనాటికి సంబంధిత పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి. 17 నుంచి నవంబరు 10 వరకు జిల్లా స్థాయి, నవంబరు 12 - 30 మధ్య రాష్ట్ర స్థాయి, డిసెంబరు 4 - 24 మధ్య జాతీయ స్థాయి పోటీలుంటాయి. ఆసక్తి ఉన్న విద్యార్థులు mygov.in వెబ్‌పేజీలో వీర్ గాథా ఆప్షన్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

సూపర్ 100 విజేతలు

వీర్‌గాథా పోటీలో ఒక స్థాయిలో ఎంపికైన వారిని, మరో స్థాయిలో ఎంపిక చేయకుండా వేర్వేరు విద్యార్థులను ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయి పోటీలలో నలుగురిని విజేతలుగా, రాష్ట్ర స్థాయి పోటీలలో 8 మందిని విజేతలుగా గుర్తిస్తారు. ఇక జాతీయ స్థాయి పోటీలలో 100 మందిని విజేతలుగా ప్రకటిస్తారు. వీరిని సూపర్-100 విజేతలుగా పిలుస్తారు. 3 నుంచి 5 వరకు 25 మంది, 6 నుంచి 8 వరకు 25 మంది, 9, 10వ తరగతి నుంచి 25 మంది, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం నుంచి 25 మందిని ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో సత్కారం, ధ్రువపత్రం అందిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు విద్యా మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ వారు రూ.10 వేల చొప్పున నగదును అందజేస్తుంది.

తరగతుల వారీగా..

- 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 150 పదాలకు మించకుండా 'నా రోల్ మోడల్' అనే పేరుతో గ్యాలెంట్రీ అవార్డు పొందిన దేశభక్తుని గురించి అంశంపై వ్యాసం లేదా డ్రాయింగ్ వేయాల్సి ఉంటుంది.
- 6 - 8వ తరగతి విద్యార్థులు గ్యాలెంట్రీ అవార్డు పొందిన వారు దేశం కోసం చేసిన త్యాగం గురించి వివరిస్తూ.. 300 పదాలకు మించకుండా వ్యాసం లేదా డ్రాయింగ్ లేదా మల్టీ మీడియా ప్రదర్శన ఇవ్వాలి.
- 9 - 10వ తరగతి వారు రాణీ లక్ష్మీభాయి కలలోకి వస్తే.. నీవు దేశసేవ ఎలా చేస్తావు అనే అంశంతో 750 పదాల వ్యాసం లేదా డ్రాయింగ్, మల్టీమీడియా ప్రదర్శన పోటీలో పాల్గొనొచ్చు.
- ఇంటర్ విద్యార్థులు స్వాతంత్ర్య ఉద్యమంలో 1857 తిరుగుబాటులో నిన్ను ప్రేరేపించిన అంశంపై వెయ్యి పదాలకు వ్యాసం, చిత్రలేఖనం ద్వారా పోటీలో పాల్గొనవచ్చు.

ఎక్కువ దరఖాస్తులు వచ్చేలా చర్యలు




పోటీల కోసం వీలైనన్ని ఎక్కువ పాఠశాలల నుంచి దరఖాస్తులు వెళ్లేలా చూస్తున్నాం. ఇప్పటికే ఆయా పాఠశాలలకు సమాచారం ఇచ్చాం. సెలవులు ఉండటం వల్ల కావడం లేదు. పాఠశాలలు ప్రారంభం కాగానే నమోదు జరిగేలా చూస్తాం. దరఖాస్తు సమయం పొడిగించే అవకాశం ఉంది. **-ఎస్తేర్‌రాణి, జిల్లా సమన్వయ అధికారిణి, జోగులాంబ**

జనరిక్ దుకాణం.. ఉపాధికి మార్గం

మహిళా సంఘాల సభ్యులకు రుణ సదుపాయం





గద్వాల, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమున్న ఔషధాలు దొరకవు. ప్రైవేటు మందుల దుకాణాలకు వెళ్లే అధిక ధరలకు విక్రయం. ఇలా పేద, మధ్య తరగతి ప్రజలు నలుగుతున్నారు. ఇందుకు ఉపశమనంగా కేంద్రం ప్రభుత్వ జనరిక్ దుకాణాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించి అమలు చేస్తోంది. అయితే ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల దుకాణాలున్నా అవగాహన అంతంత మాత్రంగానే ఉంది. మహిళా సంఘాల సభ్యులకు వీటి ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తే ఉపాధితో పాటు రోగులకు తక్కువ ధరలకే ఔషధాలు లభిస్తాయని, వీటికి ప్రాచుర్యం కూడా లభిస్తుందని భావించి గతేడాది కేంద్రం ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయించింది. రాష్ట్రాలో అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. కానీ అమల్లోనే అలక్ష్యం కనిపిస్తోంది.

మార్గదర్శకాలు ఇలా..

- మహిళా సంఘాల్లో సభ్యులే కాకుండా వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు.
- తప్పనిసరిగా డీఫాం, ఎంఫాం, బీఫార్మసీ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి.
- షాపు ఏర్పాటు చేసుకునే వారు కనీసం 120 గజాల స్థలాన్ని చూపించాలి.
- ఇప్పటికే అల్లోపతి మందుల దుకాణం ఉన్నవారు అదనంగా జనరిక్ దుకాణం ఏర్పాటుకు సైతం రుణం పొందవచ్చు.

రూ.3 లక్షల రుణం

మహిళా సంఘాల్లో సభ్యులై ఉన్న వారికి జనరిక్ ఔషధాల దుకాణం ఏర్పాటు చేసుకోవటానికి రూ.3 లక్షల రుణం ఇవ్వనుంది. అర్హులు ఎంతమంది ఉంటే అంతమందికీ రుణం ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చు. రుణాల మంజూరుకు స్త్రీ నిధి నిబంధనలను సడలించారు. ఆసక్తి, అవగాహన ఉన్న మహిళా సంఘాల్లోని కుటుంబ సభ్యులు, బంధువులు ముందుకు వచ్చి దరఖాస్తులు చేసుకోవచ్చు. కానీ ఐకేపీ అధికారులు దీనిపై అవగాహన కల్పించటంలో ఆశించిన ప్రగతి కనిపించటం లేదు.

ఉమ్మడి జిల్లాకు 90 యూనిట్లు

దేశంలో జనరిక్ మందులకు ఆదరణ పెరుగుతోంది. మన ఉమ్మడి జిల్లాలో సైతం ప్రజలు సరైన అవగాహన లేక పలు అనుమానాలు ఉండటం వల్ల వీటికి పూర్తి స్థాయి ఆదరణ లభించటం లేదు. ఈ మందులపై ప్రజల్లో అవగాహన పెంచటంతో పాటు మహిళలకు ఉపాధి కల్పించే విధంగా దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంది. సంఘంలో ఉన్న సభ్యులకు అవగాహనతో పాటు కలిగే ఉపాధి గురించి కూడా వివరంగా చెప్పాల్సి ఉంటుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 90కి పైగా దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉందని స్త్రీ నిధి పథకం పర్యవేక్షణ అధికారులు చెపుతున్నారు.

స్త్రీనిధి అధికారులను సంప్రదించి..

జిల్లాలో మహిళా సంఘాల్లో సభ్యులైన వారు వారి బంధువులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. పేద ప్రజలకు సరసమైన ధరలకు దీని వల్ల ఔషధాలు పొందే అవకాశం కల్పించినట్టవుతుంది. దరఖాస్తుల కోసం క్షేత్ర స్థాయిలో ఉన్న స్త్రీ నిధి అధికారులను సంప్రదిస్తే సరిపోతుంది.

ఖర్చు పెరిగినా.. వెనక్కి తగ్గట్లే!

ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న యాసంగి వేరుశనగ సాగు


హన్వాడ : నాయినోనిపల్లిలో వేరుశనగ విత్తనం వేస్తున్న రైతులు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం

ఎకరా వేరుశనగ సాగు చేయాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దుక్కి దున్నటం, విత్తనం కొనుగోలు, ఎరువులు, కలుపు మందులు, పురుగు మందులు, ఆ తర్వాత కోతలు.. ఇలా అన్నీ కలిపి కనీసం రూ.30వేల నుంచి రూ.40వేల పెట్టుబడి అవసరం. బాగా పండితే ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చు. చివరకు రైతులు మార్కెట్లో రూ.3వేల నుంచి రూ.4వేలకు క్వింటా చొప్పున అమ్మాల్సి వస్తోంది. ఒక్కోసారి పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ఇన్ని తెలిసినా రైతులు యాసంగి పంటగా వేరుశనగ సాగుకే మొగ్గు చూపుతున్నారు.

అందని రాయితీ విత్తనం

ఉమ్మడి జిల్లాలో వర్షాలు బాగా కురవటంతో రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు. నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని మద్దూరు, దౌల్తాబాద్, దామరగిద్ద, గండీడ్, మహమ్మదాబాద్, హన్వాడ, ధన్వాడ, నవాబుపేట, వనపర్తి కొల్లాపూర్, వీపనగండ్ల, పెద్దమందడి, పెబ్బేరు తదితర మండలాల్లో విత్తనాలు వేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై విత్తనాలు కూడా ఇవ్వటం లేదు. ఒక్కో రైతు విత్తనం కొనుగోలుకే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. మార్కెట్లో వ్యాపారులు క్వింటా విత్తనాన్ని రూ.12 వేల నుంచి రూ.13వేల వరకు ధరకు అమ్ముతున్నారు. గడిచిన వారంలో వ్యాపారులు క్వింటా విత్తనం ఏకంగా రూ.14 వేలకు అమ్మారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ పంటకు 14-35-14 ఎరువు వాడుతున్నారు. ఒక్కో బస్తా ఖరీదు రూ.1,700. ఒక్కో ఎకరాకు రెండు బస్తాలు వాడుతారు. కాడెద్దులు లేకపోవటంతో ట్రాక్టర్లతో విత్తనాలు వేసేందుకు కనీసం రూ.5వేలు వెచ్చిస్తున్నారు. కలుపు మందుకు రూ.1,200 వరకు ఖర్చు చేస్తున్నారు. నీటి తడులు అందించేందుకు డ్రిప్ పైపులు ఏర్పాటుచేస్తున్నారు. ఇందుకు రైతులు అప్పులు చేస్తున్నారు.

పంట చేతికి వచ్చేదాకా కష్టమే...

వేరుశనగ పంటకు అడవి పందుల బెడద ఎక్కువ. పంట కాపాడుకునేందుకు చలికాలమైనా రాత్రింబవళ్లు రైతులు కాపలాగా పొలంలోనే పడుకోవాలి. కొందరు రూ.వేలు ఖర్చు చేసి సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నెమళ్లు, కుందేళ్లు, ఉడతలు, పక్షులు కూడా విత్తనం తినే స్థాయి. ఏమాత్రం ఆదమరచినా.. పందులు పంట మొత్తాన్ని పాడు చేస్తాయి. పంటను కాపాడేందుకు రైతుల కనీసం 110 రోజులు శ్రమించాలి. ఇన్ని రూపాల్లో ఖర్చు, శ్రమ పెరిగినా రైతులు ఒకరిని చూసి మరొకరు వేరుశనగ పంట సాగుకు సిద్ధపడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2.60 లక్షల ఎకరాల్లో పంటను సాగుచేసే అవకాశముందని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేశ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఖర్చుతో కూడుకున్న ఈ పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, ఉలువలు, పప్పుశనగ, రాగి పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు.

పంట.. చెక్కుచెదరకుంట!


దానిమ్మ తోటకు కప్పిన గ్రో కవర్


ఆకర్షణీయంగా దానిమ్మ కాయలు

రైతులు పంట పండించటం ఒక ఎత్తయితే.. దాన్ని చీడపీడల నుంచి కాపాడుకోవడం మరో ఎత్తు. ఉద్యాన పంటల విషయంలో మరింత ఎక్కువ శ్రద్ధ తీసుకోవటం అవసరం. లేదంటే పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాదు. చిన్నచింతకుంట మండలం ఉంద్యాలకు చెందిన రైతు కోట్ల కృష్ణయ్య 8 ఎకరాల్లో దానిమ్మ తోట సాగుచేశారు. ఈ పంటకు చీడపీడల బెడద ఎక్కువ. పక్షులు, క్రిమి కీటకాలు, మంచు, ఎండల వల్ల కాయ నలుపుగా మారి నాణ్యత దెబ్బతిని సరైన ధర పలకదు. వాటి నుంచి పంటను రక్షించుకునేందుకు రైతు దానిమ్మ మొక్కలకు గ్రో కవర్ ఏర్పాటు చేశారు. తాను 8 ఎకరాల్లో సాగుచేసిన దానిమ్మ పంట మొత్తానికి ఏర్పాటు చేసేందుకు కిలో రూ.160 ధర చొప్పున రూ.1,750 చెల్లించి గ్రో కవర్ కొనుగోలు చేసినట్లు చెప్పారు. చీడపీడలు, పక్షులు దరి చేరకపోవడంతో చక్కని రంగు, నాణ్యతతో దానిమ్మ కాయలు ఆకర్షణీయంగా పెరిగాయని రైతు కృష్ణయ్య ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం

ఆయుధ పూజకు ప్రత్యేక స్థానం

జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్


మహబూబ్‌నగర్ : ఆయుధ పూజ చేస్తున్న జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీ రాములు తదితరులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: దసరా పండగలో ఆయుధాలు, వాహనాల పూజలకు ప్రత్యేక స్థానం ఉందని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో దుర్గాష్టమి సందర్భంగా ఆయుధ పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థలో ప్రతి సభ్యుడు ఆయుధాన్ని గౌరవిస్తూ, బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. పోలీస్ వ్యవస్థలో ఇది సంప్రదాయమై, ప్రతి ఏడాది దసరా పండగ సమయంలో ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పోలీస్ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు ఆయన దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ డి.జానకి, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు, సీఐలు అప్పయ్య, గాంధీ, ఆర్ఐ అడ్మిన్ కృష్ణయ్య, ఎంటీవో నగేశ్, రమేశ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శరణ్మయీ.. శరణు!


శాంతినగర్‌లో అమ్మవారిని గురువారం దుర్గాదేవిగా అలంకరించారు.


కల్వకుర్తి: ముకురాలలో దుర్గామాత విగ్రహం వద్ద యువకులు


అచ్చంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో నవదుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


నవాబ్‌పేట : శ్రీమహా దుర్గాదేవిగా ఫతేపూర్ మైసమ్మ

విజయదశమి సమీపిస్తుండటంతో నవరాత్రి ఉత్సవాలు ఊపందుకుంటున్నాయి. పట్టణాలు, పల్లెల్లోని ఆలయాల్లో అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తున్నారు. దసరా సందర్భంగా బతుకమ్మ సంబరాలు అంబరమంటుతున్నాయి. మహిళలు బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. **-న్యూస్‌టుడే బృందం**


కొత్తకోట : కానాయపల్లి శ్రీకోటిలింగేశ్వరాలయంలో దుర్గాదేవిగా జ్ఞానాంబికాదేవి


గద్వాల తేరుమైదానంలో బతుకమ్మ పాటకు నృత్యం చేస్తున్న మహిళలు


మహబూబ్‌నగర్: బ్రాహ్మణవాడలోని వాసవీమాత ఆలయంలో మహిషాసురమర్ధని అలంకరణలో..

హామీల అమలుపై నిలదీయండి: ఎంపీ


హన్వాడలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

హన్వాడ, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కార్యకర్తలు, ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. గురువారం మండల కేంద్రంలో, గుడిమల్కాపూర్, బుద్దారం గ్రామాల్లో నిర్వహించిన భాజపా సభ్యత్వ కార్యక్రమంలో ఆమె పాల్గొన్ని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఆరు గ్యారంటీలతో హామీ లిచ్చిందని వాటిల్లో ఒకటి తప్పా మిగతావి పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏర్పడిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకోని ప్రతి కార్యకర్త వంద మందికి, మండల నాయకుడు ఐదు మందల మందికి పార్టీ సభ్యత్వం కల్పించాలన్నారు. తద్వారా వచ్చే స్థానిక ఎన్నికల్లో మళ్లీ భాజపా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమస్యల సాధనకు భాజపా కార్యకర్తలు నిరంతరం శ్రమించాలన్నారు. హన్వాడ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో హన్వాడ నుంచి మంచి మెజార్టీ ఇచ్చిన కార్యకర్తలకు, ప్రజలకు ఎంపీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి కె.బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి, నాయకులు నారాయణ యాదవ్, రతంగ పాండురెడ్డి, మండలాధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కారు దగ్ధం


మాగనూరు శివారులో కాలిపోతున్న కారు

మాగనూరు, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా మాగనూరు వద్ద గురువారం ఉదయం ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని కారు దగ్ధమైంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో మంత్రాలయం వెళ్తుండగా ఉదయం ఆరు గంటల సమయంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఆ సమయంలో కారులో నలుగురు పెద్దవారు, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. అందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న వారంతా దిగి పక్కకు వచ్చిన తర్వాత షార్ట్ సర్క్యూట్ జరిగి కారులో మంటలు చెలరేగాయి. వెంటనే 100కు డయల్ చేయడంతో అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మాగనూరు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

చిరుత మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు


చిరుత మృతదేహానికి డీఎఫ్‌వో సమక్షంలో పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : నల్లమలలోని అమరగిరి అటవీ ప్రాంతంలో చిరుత మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి చెప్పారు. బుధవారం సాయంత్రం చిరుత మృతదేహానికి డీఎఫ్‌వో సమక్షంలో పోస్టుమార్టం చేసి పూడ్చిపెట్టారు. ఈ సంఘటనపై ఆయన గురువారం మాట్లాడుతూ...ప్రస్తుత నివేదిక ప్రకారం అనారోగ్య సమస్యలతోనే చనిపోయినట్లు తెలుస్తోందన్నారు. అయినా కాలిగోర్లు, పన్ను, కాలేయం తదితర అవయవాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. నిఘా మరింత పెంచామని, అటవీ సంరక్షణకు కొల్లాపూర్ రేంజ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. ఎఫ్‌డీవో తిరుమలరావు సైతం కొల్లాపూర్‌లో సిబ్బందితో సమావేశమై పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం.

చికెన్ ధరలు

ఫాంరేటు	109-00
రిటైల్	131-00
డ్రెస్డ్	190-00
స్కిన్‌లెస్	216-00

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో... రవి : దేవర
రమణ : వేట్టయన్ దహంటర్. రామకృష్ణ : విశ్వం. కల్వకుర్తిలో... పార్థసారథి : దేవర
అశోక్ : వేట్టయన్ దహంటర్

విధుల నుంచి జూనియర్ అసిస్టెంట్ తొలగింపు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కొండల్‌రావును విధుల నుంచి పూర్తిగా తొలగించినట్లు ఆర్డీవో యాదగిరి, డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి భరత్‌కుమార్ తెలిపారు. వీధుల్లో నిర్లక్ష్యం వహించిన ఆర్డీవో నాగరాజును సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొండల్‌రావును కలెక్టర్ ఉద్యోగం నుంచి తొలగించినట్లు అధికారులు చెప్పారు.


నాగర్‌కర్నూల్: కలెక్టరేట్‌లో బతుకమ్మకు పూజలు చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్


అచ్చంపేట: ఒడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు


వెల్దండ: కుప్పగండ్లలో..


తిమ్మాజిపేట: ఆవంచలో..


నాగర్‌కర్నూల్ : హౌసింగ్‌బోర్డు కాలనీలో...


అచ్చంపేట: ఉమామహేశ్వరం క్షేత్రంలో సిద్ధిధాత్రి దేవిగా


కొల్లాపూర్‌లో..

అమ్మవారి ఉత్సవం.. బతుకమ్మ వైభవం

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ, అమ్మవారి శరన్నవరాత్రులు, ఆయుధపూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. సమీకృత కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవ సహాయంలతో కలిసి బతుకమ్మ సంబురాలను ప్రారంభించారు. కల్వకుర్తిపట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా అలంకరించారు. కొల్లాపూర్ కన్యకాపరమేశ్వరాలయంలో దుర్గమాత అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా వరిదేల శమీవృక్షం వద్ద పూజలు చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో, చారకొండ మండల కేంద్రంలోని విద్యుత్తు ఉప కేంద్రంలో ఆయుధ పూజలు నిర్వహించారు. ఉమామహేశ్వర క్షేత్రంలో ఉమాదేవి అమ్మవారిని సిద్ధిధాత్రి దేవిగా అలంకరించారు. అచ్చంపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో నవదుర్గా దేవిగా అలంకరించారు. కల్వకుర్తి, తర్నికల్, మార్చాల, జీడిపల్లి, తోటపల్లి, ముకురాల గ్రామాల్లో కోలాటాలు వేశారు. వెల్దండ పాండు రంగనాయకస్వామి ఆలయంలో కూరగాయలతో అలంకరించారు. ఊర్కొండ, అమ్రాబాద్, పదర, తిమ్మాజిపేట, ఉప్పునుంతల, లింగాల మండలాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


– న్యూస్‌టుడే, బృందం


అమ్రాబాద్‌లో...


లింగాలలో...

అంబరాన్నంటేలా 'నల్లమల మహా బతుకమ్మ'

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: నల్లమల మహా బతుకమ్మ వేడుకలను శుక్రవారం అంబరాన్నంటేలా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయం ఎదురుగా వేదికను తీర్చిదిద్దారు. వేడుకలకు నల్లగొండ (గద్దర్) గద్దర్, రేలారే రేల గంగ, బిగ్‌బాస్ కళాకారులు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఏర్పాట్లను గురువారం రాత్రి ఎమ్మెల్యే వంశీకృష్ణ పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కమిషనర్ శ్యామ్‌సుందర్, సిబ్బంది పాల్గొన్నారు.



అచ్చంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ అచ్చంపేట' బోర్డు

ఆర్డీవో బాధ్యతల స్వీకరణ

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ ఆర్డీవోగా ఎ. యాదగిరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లా భూసేకరణ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తనకు ఆర్డీవోగా పూర్తి బాధ్యతలను కలెక్టర్ సంతోష్ అప్పగించారని చెప్పారు. అనంతరం కొల్లాపూర్ పరిధిలో సమీకృత వసతి గృహం భూమిని పరిశీలించారు. ఆర్‌ఐ జానయ్య, సర్వేయర్ పాండు తదితరులు ఉన్నారు.


యాదగిరి

ఆలయాలను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాలను గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ.వేణుగోపాల్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకం, జోగులాంబ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. అలంపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కవిత, కోర్టు సిబ్బంది వెంట ఉన్నారు.


దర్శనానికి వస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ దంపతులు

భారీవర్షం.. రైతులకు నష్టం

కల్వకుర్తిపట్టణం, కల్వకుర్తి న్యూస్‌టుడే : కల్వకుర్తి పట్టణంలో గురువారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభమైన వర్షం 2గంటల వరకు కురిసింది. దీంతో పట్టణంలో రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. మార్కెట్‌లో కూరగాయలు, పూలు విక్రయించే వ్యాపారులు నీళ్లలోనే అమ్మకాలు చేసుకున్నారు. వేరుశనగ, పత్తి రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లడంతో ఆందోళన చెందుతున్నారు.

తాడూరు: మండలంలో గురువారం ఉరుము, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షంతో పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో పొలం పనులు ముందుకు సాగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కల్వకుర్తి కూరగాయల మార్కెట్‌లో వర్షపు నీరు

కలెక్టర్‌కు వినతి

అచ్చంపేట, న్యూస్‌టుడే : లోక్‌సభ ఎన్నికల విధులకు హాజరైన ఉపాధ్యాయులకు సంబంధించిన సెలవులు మంజూరు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రావు కోరారు. గురువారం నాగర్‌కర్నూల్‌లో కలెక్టర్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు ఎస్టీయూ నేతలు ఈశ్వర్, రమేష్, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని సాతాపూర్‌లో దసరా ఉత్సవాల సందర్భంగా తాలూకా స్థాయి కబడ్డీ పోటీలను మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఎస్సై సతీష్ ప్రారంభించారు. విజేతలకు దసరా రోజు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు శివరాజేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రావు, పగడాల చిన్నయ్య, పద్మమ్మ, వెంకటయ్య, నారాయణరావు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న మాజీ ఎంపీపీ, ఎస్సై

ఆకట్టుకున్న సంగీత నృత్య రూపకం

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి నృత్య రూపకం అలరించింది. వాసవీమాత జీవిత చరిత్రను 25 మంది కళాకారులతో ప్రదర్శించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కళాకారులతో ఆలయ కమిటీ ప్రతినిధులు

భూపట్టాలు మార్చేశారని ఆందోళన

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : తమ భూములను తెలియకుండానే పట్టాలు మార్పిడిచేశారంటూ గురువారం కొందరు రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తిమ్మాజిపేటకు చెందిన రైతుల భూములను హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులపై మార్పిడిచేశారని, తమ పొలాలను తిరిగి ఇప్పించాలంటూ తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే కొందరు రైతులకు సదరు వ్యక్తులతో తిరిగి పట్టాలు చేయించినట్టు వారు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేసి తమను ఆదుకోవాలని కోరారు. కొద్దిసేపు తహసీల్దార్ చాంబర్ ఎదుట బైఠాయించారు. కోర్టు తీర్పుద్వారా హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులపై మార్పిడి జరిగినట్టు తహసీల్దార్ రామకృష్ణ వారికి వివరించారు. తమకు ఎలాంటి సంబంధం లేదని ఆయన చెప్పారు.


తహసీల్దార్ చాంబర్ ఎదుట బైఠాయించిన రైతులు

ఘనంగా ఆర్ఎస్ఎస్ కవాతు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శాఖ కొల్లాపూర్‌లో గురువారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవాహ ఆంజనేయులు, కట్టా నరేందర్‌రెడ్డి మాట్లాడారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, మేకల విజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రార్థన చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి తొడుగు

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేటలోని వాసవీ మాత ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని గురువారం భక్తులు వెండి తొడుగుతో అలంకరించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయ కమిటీ ప్రతినిధులు శేఖర్, బాలరాజు, శ్రీనివాసులు, వినోద్, భాస్కర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు వెండి కమలం బహుకరణ

తెలకపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ.3లక్షల విలువ చేసే వెండి కమల పుష్పంను బహుకరించారు. అర్చకుడు శ్రీకాంత్‌శర్మకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఇరివెంటి శ్రీనివాసులు, ఆంజనేయులు, నరేందర్ పాల్గొన్నారు.


అర్చకుడు శ్రీకాంత్‌శర్మకు వెండి కమలాన్ని అందజేస్తున్న భక్తులు

రోడ్డుకు మరమ్మతులు

వెల్దండ, న్యూస్‌టుడే: వెల్దండ మండల కేంద్రం నుంచి కంటోన్‌పల్లి 3.5 కి.మీ తాత్కాలిక రోడ్డు మరమ్మతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇటీవల వర్షాలకు రోడ్డు దెబ్బతిని రాకపోకల ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గ్రామస్థులు మాజీ సర్పంచి రామకృష్ణ, ఉప సర్పంచి సురేందర్ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు గురువారం గోతులను పూడ్చారు.


వైద్య విద్యార్థినిని సన్మానిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

లక్ష్యం లేని చదువులు వ్యర్థం

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రాథమిక దశలోనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా పయనించాలని, లక్ష్యం లేని విద్య వ్యర్థమని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం వెల్దండ మండల కేంద్రంలో వైద్య సీటు సాధించిన విద్యార్థిని హాసిని, 3 ఉద్యోగాలు సాధించిన అజయ్‌కుమార్ తండ్రి జంగయ్యను ఆయన ఘనంగా సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేయాలన్నారు. విద్యార్థులు చరవాణులను పక్కనపెట్టి చదువుకు పదును పెట్టాలని సూచించారు. మాజీ ఎంపీపీ రాంరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, నిరంజన్, అశోక్, ప్రభాకర్ ఉన్నారు.

మార్కెట్‌కు 3 రోజుల సెలవు

అచ్చంపేట, న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించామని మార్కెట్ కార్యదర్శి నరసింహులు తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజుల పాటు క్రయవిక్రయాలు నిలిపేస్తున్నామని చెప్పారు. మూడు రోజులు ధాన్యం తేవొద్దని సూచించారు.

భాజపా పాలనలోనే దేశాభివృద్ధి

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: భాజపా పాలనలోనే దేశం సుభిక్షంగా ఉందని ఆపార్టీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి అన్నారు. గురువారం చారకొండ మండలం శిర్సనగండ్ల, తుర్కలపల్లి, సారంబండతండాలలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రపంచమంతా ప్రధాని మోదీ పాలన వైపు చూస్తోందని, దేశ ప్రజలు భాజపాకు మూడు సార్లు పట్టం కట్టారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పర్చడంతో ఘోరంగా వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో భాజపా నాయకులు కృష్ణ, చంద్రారెడ్డి, జ్యోతి, సందీప్, శ్రీరామ్, మహేశ్‌రెడ్డి, శరత్ పాల్గొన్నారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్నచింతకుంట మండలంలోని దమాగ్నాపూర్ గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానుండటంతో కలెక్టర్ విజయేందిర బోయి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించాలని యంగ్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేయడంతో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల శంకుస్థాపన పనులకు అన్ని ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


చిన్నచింతకుంట: దమాగ్నాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కల్వకుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో చిన్న ఓబులేశ్ అన్నారు. గురువారం కల్వకుర్తి మండలం జీడిపల్లిలో శ్రీనిధి పథకం ద్వారా రుణ సహాయంతో మదర్ యూనిట్ కేంద్రం ఏర్పాటు చేశారు. రూ.2.9లక్షలతో ఏర్పాటు చేసిన నాటు కోడి పిల్లల పెంపక కేంద్రంను డీఆర్‌డీవో, అదనపు డీఆర్‌డీవో లక్ష్మీనారాయణ, డీపీఎం సుధాకర్, వెంకటేశం, ఎంపీడీవో వెంకట్‌రాములు పరిశీలించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి జిల్లాకే ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, రైతు మల్లేశ్‌గౌడ్, ఎంఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో, అధికారులు

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

కందనూలు, న్యూస్‌టుడే : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి జి. సబిత అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని జనరల్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు అలవాటైతే మానసిక విచక్షణ కోల్పోయి తోటి వారితో ఘర్షణలు, లైగింక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని చెప్పారు. చిన్న పిల్లలు చరవాణీలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకుడు డా. రఘు, వైద్యులు డా.వెంకట్‌దాస్, డా. శ్రీనివాసులు, అంబూజ, న్యాయవాదులు మధుసూదన్‌రావు, బ్రహ్మేశ్వర్‌రావు, శ్యాంప్రసాద్‌రావు, రాంచందర్, రాంబాబు, కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి జి.సబిత

చైతన్యంతోనే మైలారం గుట్ట పరిరక్షణ

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : ప్రజలు, ప్రజా సంఘాల చైతన్యంతో మైలారం గుట్ట పరిరక్షణ సాధ్యమవుతుందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఇటీవల మైలారం గుట్టపై ప్రారంభించిన పలుగు రాళ్ల తవ్వకాలను ఆపేందుకు అనుసరించాల్సిన విధి విధానాలపై గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంతో పాటు ప్రకృతిని కాపాడుకునేందుకు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యయుతంగా ముందుకెళ్లాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలి, పెట్టుబడిదారులకు తోడ్పాటు అందిస్తున్నాయని ఆరోపించారు. గుట్ట పరిరక్షణకు కార్యవర్గం ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం గుట్టను సందర్శించారు. నేతలు నారాయణరావు, సుభాన్, బాలయ్య, వెంకటేశ్వర్లు, బంగారి, అంతయ్య, దేవస్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించండి

కందనూలు, న్యూస్‌టుడే : ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏలు, ఇతర బకాయిలు తక్షణమే చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. రాముడు నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మేలు

కందనూలు, న్యూస్‌టుడే : మనసు బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. స్వరాజ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్యం దినోత్సవం, ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని జడ్పీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. మానసిక సమస్యలను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నివారించడానికి వీలు అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డా. వెంకట్‌దాస్, ప్రోగ్రాం అధికారులు డా. రవికుమార్, డా. శ్రీనివాసులు, డా. కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.స్వరాజ్యలక్ష్మి

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

ఊర్కొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాలు మారడం లేదని ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఐటీయూ మహాసభ మండల కన్వీనర్ పరశురాములుఅధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించాలి..

కందనూలు, న్యూస్‌టుడే : పుర పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పుర కార్యాలయంలో సమ్మె నోటీసు జారీ చేశారు. నాయకులు భీముడు, బాలరాజ్, కురుమయ్య, పాషా, వెంకటేశ్, సత్యం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో బలవన్మరణం.. జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే : రెండేళ్లుగా మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట ప్రాంతానికి చెందిన వాసు(36) రెండేళ్లుగా బంజారాహిల్స్ రోడ్ నంబరు 10లోని ఐపీఎస్ క్వార్టర్స్ సమీపంలో నివసిస్తున్నారు. కొంత కాలంగా వివిధ పోటీపరీక్షలకు హాజరుకాగా, ఎంపిక కాలేదు. అంతేకాకుండా తల్లిదండ్రుల మరణంతో కుంగిపోయాడు. మానసిక స్థితి బాగోలేకపోవడంతో కొన్నాళ్లుగా చికిత్స తీసుకుంటున్నారు. గురువారం ఇంట్లో ఫ్యానుకు తాడుతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడు నగరంలోని ఓ జోన్ డీసీపీ బామ్మర్ది కావడంతో ఆయన అక్కడికి చేరుకున్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహానికి అంత్యక్రియలు.. లింగాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో మంగళవారం రాత్రి మృతిచెందిన గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి బుధవారం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఆమెకు సంబంధించిన బంధువులు ఎవ్వరూ రానందున గురువారం పోస్టుమార్టం చేశారు. అనంతరం లింగాల మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బంది, పోలీసుల ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్సై చెప్పారు.

రహదారి ప్రమాదంపై కేసు నమోదు.. బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : ప్రమాద ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. ఈనెల 9న మైలారం గేటు సమీపంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రుడు అన్వర్ సోదరుడు ఆసీఫ్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నేనావత్ మోహన్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. ఆరుగురిపై కేసు.. కోడేరు, న్యూస్‌టుడే : అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేసిన ఆరుగురిపై గురువారం కేసు నమోదైంది. ఎస్సై గోకారి కథనం ప్రకారం...కోడేరుకు చెందిన చంద్రకళకు పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌కు చెందిన మల్లేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో రూ.4.50 లక్షలు, ఎనిమిదిన్నర తులాల బంగారం, ఒక స్కూటీ వాహనం కట్నం కింద ఇచ్చారు. అయితే మూడేళ్లుగా అదనపు కట్నం తేవాలంటూ భర్తతో పాటు అత్తమామ అంజమ్మ, పెద్ద నరసింహ, బావ వెంకటేష్, ఆడపడుచులు అలివేల, నాగమణిలు వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళను హత్య చేసిన వ్యక్తి అరెస్టు.. వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ఓ మహిళను హత్య చేసిన సంఘటనలో నిందితుడు బి.ప్రభాకర్‌ను గురువారం అరెస్టు చేశామని ఎస్సై జలేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న గోపాల్‌పేట మండలం ధర్మాతండా శివారు పాటిగడ్డతండాకు చెందిన శాంతమ్మ వనపర్తికి వచ్చారు. గాంధీచౌక్‌లోని ఓ మద్యం దుకాణంలో బి.ప్రభాకర్‌తో పాటు ఆమె మద్యం తాగారు. అనంతరం ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని చిమనగుంటపల్లి గ్రామ శివారులోని ఓ బావి వద్దకు వెళ్లారు. వారి మధ్య డబ్బుల విషయంలో వివాదం జరిగింది. శాంతమ్మను బావిలోకి తోసి ఆమె చనిపోయిన అనంతరం ద్విచక్ర వాహనంపై నిందితుడు వనపర్తికి వెళ్లినట్లు ఎస్సై తెలిపారు. బావిలో తోసే క్రమంలో నిందితుడి ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు పడిందని చెప్పారు. గురువారం అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకొన్నట్లు పేర్కొన్నారు. వనపర్తి కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు తెలిపారు.

సారా బెల్లం పట్టివేత.. వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: సారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక, సారాను ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. వెల్దండ బస్టాండ్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అచ్చంపేట మండలం సిద్దాపూర్‌కు అక్రమంగా తరలిస్తున్న 840 కిలోల బెల్లం, 40కిలోల పటిక, 10లీటర్ల సారాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. వాహనం, బెల్లం, సారాను స్వాధీనం చేసుకొని రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం చరికొండ గ్రామానికి చెందిన కాత్రావత్ రమేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి. ఎస్సై సృజన్, సిబ్బంది రామకృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మానీందర్, తాజుద్దీన్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఇద్దరికి గాయాలు.. కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని రామాపురం సమీపంలోని వ్యవసాయ పొలంలో పిడుగు పడగా యువకుడు చెన్నంపల్లి శేఖర్ గాయపడ్డారు. కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన మహేష్ అనే వ్యక్తి సైతం పిడుగుపాటుకు స్వల్పంగా గాయపడ్డారు.